క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు


హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేస్తున్న నాయకులు

మల్లాపూర్: మండలకేంద్రంలో ఐదు ప్రధాన కూడళ్ల వద్ద శనివారం హైమాస్ట్ లైటింగ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సహకారంతో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జెడ్పీ నిధులు మంజూరు చేయించారన్నారు. కొత్తబస్టాండ్ తెలంగాణతల్లి కూడలి, వడ్డెర కాలనీ, అంబేడ్కర్ కూడలి, అల్లూరి సీతారామరాజు కాలనీ, మార్కెట్‌యార్డ్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లతో నూతన కాంతులు

బుగ్గారం: హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు విరజిమ్ముతాయని సర్పంచ్ లతశ్రీ నర్సింగం తెలిపారు. మండలంలోని చిన్నాపూర్‌లో సంక్రాంతి సందర్భంగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు రాజమణి, రాజేందర్ ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



రాయికల్: మహారాష్ట్రలోని జలగౌ జిల్లాగోద్రిలో ఈనెల 25 నుంచి 30 వరకు నిర్వహించే బంజారా కుంభమేళా పోస్టర్‌ను శనివారం బంజార సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంజారా మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, జిల్లా దిశకమిటీ సభ్యులు భూక్య గంగాధర్‌నాయక్, నాయకులు గంగాధర్‌నాయక్, బానోతు రమేశ్‌నాయక్, భూక్య సంతోష్‌నాయక్, భూక్య వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపెల్లి ప్రీమియం క్రికెట్ లీగ్ విజేత యువ టీం..


ట్రోఫీతో యువ టీం సభ్యులు

మేడిపెల్లి: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలకేంద్రంలో శనివారం మేడిపెల్లి ప్రీమియం క్రికెట్‌లీగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో రాక్‌స్టార్ టీంను ఓడించి యువటీం విజేతగా నిలిచింది. ఈ మేరకు విన్నర్, రన్నర్ టీంలకు సర్పంచ్ వరలక్ష్మి ట్రోఫీలు బహూకరించారు. ఉపసర్పంచ్ గొప్కి మధు, క్యాతం మహేందర్‌రెడ్డి, బండారి నరేశ్, మొబిన్ ,శేఖర్ పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ పోటీలు

సారంగాపూర్: మండలకేంద్రంలో శనివారం భోగి పండుగ సందర్భంగా సంక్రాంతి క్రికెట్ పోటీలనురెడ్డి యువజన సంఘ సభ్యులు నిర్వహించారు. సారంగాపూర్, నాయికపుగూడెం గ్రామాల మధ్య నాలుగు జట్లు ఎంపికచేసి క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గంగారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రాంచంద్రారెడ్డి, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హైలెవెల్ వంతెన నిర్మించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో హైలెవెల్ వంతెన నిర్మించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింబాద్రి మాట్లాడుతూ... అధిక వర్షాలు కురిస్తే వంతెనల వద్ద ఉధృతంగా నీరుప్రవహిస్తోందని రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి హైలెవెల్ వంతెనలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి గోపికిశోర్, నర్సయ్య, వెంకటేశ్, వడ్ల అంజయ్య, ఇంతీయాజ్, బైని వెంకటేశ్, ప్రశాంత్, గంగాధర్, నరేశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజహితం కోసం ఏకమై..

> సారంగాపూర్: పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలని వారు ప్రతినభూనారు. ఇందుకు వేదికగా వాట్సాప్ గ్రూపును ఎంచుకున్నారు. అంతే ఇక చిన్ననాటి స్నేహితులంతా కలిసి వాట్సాప్ గ్రూపులో చేరిందే తడవుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ మీకు తోడుగా మేమున్నామంటూ ధైర్యం కల్పిస్తున్నారు. బీర్‌పూర్ మండలం జెడ్పీపాఠశాలలో చదివిన 2015 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు.


ఇళ్లు కాలిపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

- వాట్సాప్ వేదికగా బీర్‌పూర్ పాఠశాల పూర్వ విద్యార్థుల విస్తృత సేవలు
- ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం
- తాము సంపాదించిన దాంట్లో కొంత పేదలకు, కొంత గ్రామాభివృద్ధికి

సండే స్పెషల్

బీర్‌పూర్ జెడ్పీ పాఠశాలలో 2015లో తనతో పాటు కలిసి చదువుకున్న మిత్రులతో ఆదే గ్రామానికి చెందిన చిట్నేని విజయ్‌కుమార్ ప్రస్తుతం వివిధ ప్రదేశాల్లో వివిధ వృత్తి బాధ్యతల్లో ఉన్న 150 మందిని ఒక దగ్గరికి చేర్చి సోషల్‌మీడియా ద్వారా సమాజహితం కోసం ఎన్నో కార్యక్రమాలు చేయొచ్చని నిరూపించింది. వాట్సాప్‌గ్రూప్ బృందం. ఇందులో ఐటి, ఫార్మా, పోలీస్, ఉపాధ్యాయ, ఉద్యోగ, గల్ఫ్‌దేశాల్లో ఉద్యోగం చేస్తూ ఆర్థికసాయం అందిస్తు అండగా నిలుస్తున్నారు.

150 మందితో వాట్సాప్ గ్రూపు

తాము ఎక్కడ ఉన్నా ఏ పనిచేస్తున్నా సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని గ్రామాభివృద్ధికి, మరికొంత కష్టాల్లో ఉన్న కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడి చదువుకు దూరంగా ఉన్నవారికి, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని పూడ్చి ఆ కుటుంబాలను నిలబెట్టడానికి తమకు తోచినంత సాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. ఏడేళ్లుగా ప్రజల మధ్యే ఉంటు సేవలందిస్తున్నారు.

గ్రూపు ద్వారా చేసిన కార్యక్రమాలు ...

- నాలుగేళ్లుగా బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భక్తుల దాహం తీర్చడానికి ప్రతీ ఏడాది 20వేల లీటర్లు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు.
- బీర్‌పూర్ మండలంలో చనిపోయిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు రూ.60వేల బాడీఫ్రీజర్‌ను జీపీకి అప్పగించారు.
- వారు చదివిన పాఠశాలలో రూ.85వేలతో 10వేల లీటర్లతో వాటర్ ట్యాంక్ నిర్మించారు.
- బీర్‌పూర్ ఆలయం వద్ద భక్తుల కోసం రూ.90వేలతో విశ్రాంతిగది, సిమెంట్ బెంచీనిర్మించారు.
- పదోతరగతిలో అత్యుత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం ఇస్తున్నారు.
- తల్లితండ్రులు లేని నిరుపేద అనాథ విద్యార్థుల ను చదువుల్లో ప్రోత్సహించడానికి రూ.50వేల వరకు నగదు అందిస్తున్నారు.
- గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటుకు సాయం అందించారు.
- తమ తోటి విద్యార్థి గుండ వేణుగోపాల్ మరణిస్తే కూతురుకు ఆర్థికసాయం చేశారు.
- జగిత్యాల ఆనంద నిలయం అనాథ బాలికలకు చలికాలంలో స్వెటర్లు అందించారు.
- పూడూరి గంగాధర్ అనే పారిశుధ్యకార్మికుడి రెండుకిడ్నీలు చెడిపోతే చికిత్స నిమిత్తం రూ.70వేలు సాయం అందించారు.
- పూర్వ విద్యార్థి పూడూరి రవికి ఆస్పత్రిలో చికిత్సకు రూ.15వేలు సాయం చేశారు.
- గతేడాది వర్షాలకు ఇల్లు కూలిపోయి గాయాల పాలైన గుండ శేఖర్ పూర్వవిద్యార్థికి రూ.14వేలు సాయం అందించారు.
- పూర్వ విద్యార్థి చీపురుశెట్టి తిరుమల్ బీర్‌పూర్ అంజనేయస్వామి ఆలయానికి పెద్దమొత్తంలో వెచ్చించి సౌండ్‌సిస్టం అందించారు.
- కండ్లపల్లిలో ఇళ్లు కాలిపోయిన పేద గిరిజన కుటుంబాలకు రూ. 10వేలు సాయం అందించారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే



కష్టాల్లో ఉన్నవారికి కొంత వరకైనా ఆదుకుని ఆ కుటుంబానికి బాసటగా నిలవాలన్న సంకల్పం మా గ్రూపు సభ్యుల అందరిలో మదిలో ఉంది. ఏడేళ్లుగా కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది. – విజయ్‌కుమార్, బీర్‌పూర్

గ్రామాభివృద్ధికి ఆసరాగా..



ఏ చోటుకు వెళ్లినా ఉన్న ఊరును మరిచిపోవద్దని పెద్దలు చెబుతుంటారు. అందుకే మేము చదివిన పాఠశాలతో పాటు, మా గ్రామాల్లో కొన్ని కార్యక్రమాలైనా చేయాలన్న ఆలోచనతో ఈ గ్రూపు సభ్యులం సేవలను కొనసాగిస్తున్నాం. – తిరుమల్, బీర్‌పూర్

చాలా సంతోషంగా ఉంది



గ్రూపు ద్వారా ఆపదలో ఉన్న కుటుంబాలకు కొంత వరకైనా సేవచేస్తున్నామంటే చాలా సంతృప్తిగా ఉంది. మనం సంపాదించిన దానిలో కొంతైనా ఇతరుల కష్టాల్లో బాసటగా నిలుస్తున్నాం. – నర్సయ్య, బీర్‌పూర్

దేవుడి ఆశీస్సులతో

కొండపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి, స్వామి దయతో జీవితాల్లో స్థిరపడ్డాం. మాతో ఇతరులు కూడా నిలదొక్కుకుంటే మాకు సంతోషంగా ఉంటుంది. – యశోద వేణు, బీర్‌పూర్.

గ్రామస్థాయి వాలీబాల్ టోర్నీ


వాలీబాల్ టీంతో ప్రజాప్రతినిధులు, నాయకులు

మల్లాపూర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని, యువత క్రీడలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సర్పంచ్ బొడ్డు సుమలత అన్నారు మకర సంక్రాంతి సందర్భంగామండలంలోని చిట్టాపూర్‌లో లోకల్ రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై మాట్లాడారు. గెలుపోటములు సహజమని, క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. ఈ టోర్నీలో 14 జట్లు పాల్గొనగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్‌రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



వెల్గటూర్: మండలకేంద్రంతో పాటు ఎండపల్లి మండల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్గటూర్ ఎస్సై నరేశ్ కుమార్ అన్నారు. ఈమేరకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. రెండు మండలాల పరిధిలోని పరిసర గ్రామాల్లో దొంగల అలజాడి మళ్లీ మొదలైందన్నారు. ముఖ్యంగా పంట పొలాల వద్ద కరెంట్ మోటార్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్లు దొంగిలిస్తున్నారని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100 నంబరుకు ఫోన్‌చేయాలని సూచించారు. 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారని, సర్పంచులు చొరవ తీసుకొని గ్రామాల్లో డప్పుచాటింపులు వేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

అభాగ్యులకు అండగా దాతల సాయం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


నిత్యావసరాలు అందజేస్తూ..


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రాయికల్: మండలంలోని లయన్స్‌క్లబ్‌సభ్యుడు కుర్మ సుదర్శన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం హనుమాన్ ఆలయం వద్ద యాచకులకు దుప్పట్లు పంపిణీచేశారు. రాయికల్ పట్టణానికి చెందిన రిక్షా కార్మికుడు మంద రాజశేఖర్ ఇటీవల మృతిచెందగా నిరుపేద కుటుంబానికి శనివారం సామాజిక కార్యకర్త కడకుంట్ల జగదీశ్వర్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఆలూరు గ్రామంలోని బాపురపు రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా నిరుపేద కుటుంబం కావడంతో ఎన్‌ఆర్‌ఐ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో రూ.16,500 కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎద్దండి దివాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కొత్తపల్లి రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు మచ్చ శేఖర్, డీసీ బత్తిని భూమయ్య, సభ్యులు దాసరి గంగాధర్, వాసం స్వామి, వాసం ప్రసాద్, కాటిపల్లి రాంరెడ్డి, నవీన్, కట్కం కల్యాణ్, వెంకట్‌రెడ్డి, కట్లనర్సయ్య, పారిపల్లి శ్రీనివాస్ నాయకులు చింతకుంట సాయికుమార్, షాకీర్, కిరణ్‌రావు, కొత్తపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు


హరిదాసు వేషాధారణలో బాలుడు


ధర్మపురిలో సంక్రాంతి వేడుకలు


ముగ్గులు వేస్తున్న చిన్నారులు, మహిళలు


రాయికల్‌లో..

జగిత్యాలరూరల్/కథలాపూర్/బుగ్గారం/పెగడపల్లి/మల్లాపూర్/వెల్గటూర్/ధర్మపురి/రాయికల్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో శనివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముంగిళ్లలో అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పేర్చారు. ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఉదయం భోగి మంటలు వేసుకొని ఉల్లాసంగా గడిపారు. మహిళలు ఇళ్లల్లో పిండివంటలు చేసేపనిలో నిమగ్నమయ్యారు. పలువురు మహిళలు చిన్నారులపై భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. పతంగులతో చిన్నారులు సందడి చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


పెగడపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


పెగడపల్లి ఆలయంలో భోగి మంటలు

నూతన మండల కమిటీ నియామకం


ఎన్నికైన చంద్రయ్య, రవి

పెగడపల్లి: తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) పెగడపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా బొమ్మెన చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు శనివారం పెగడపల్లిలో జరిగాయి. ప్రధానకార్యదర్శిగా అనంతుల రవి, గౌరవ అధ్యక్షుడిగా సుంకె జోగవ్వ, కోశాధికారిగా తుల్ల ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా పంజాల పర్శురాం ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఆత్మకూరి రాజేశం, గర్శకుర్తి రాజు, కార్యవర్గ సభ్యులుగా కొత్తపల్లి సత్తయ్య, మొల్లూరి శ్రీకాంత్, మాచర్ల స్వామి ఎన్నికయ్యారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



ధర్మపురి: అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శబరిమలలో శనివారం సాయంత్రం జరిగిన జ్యోతిదర్శనం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్ ఆధ్వర్యంలో ధర్మపురిలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వాములు పెండ్యాల బాలకృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలతో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాలికతో వ్యభిచారం.. మహిళలపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో బాలిక(16)తో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరు మహిళలపై నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ శనివారం తెలిపారు. యాదాద్రి ప్రాంతానికి చెందిన బాలిక తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందారు. దీంతో హైదరాబాద్ డబీర్‌పూర్ ప్రాంతానికి చెందిన సమీప బంధువు ఒకామే బాలికను చేరదీసింది. మూడు నెలల క్రితం జగిత్యాలకు తీసుకొచ్చి వ్యభిచార గృహం నిర్వాహకురాలుకు అప్పగించింది. నిర్వాహకురాలు బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయిస్తోంది. అయితే, యాదాద్రి ప్రాంతానికి చెందిన ఎస్సై ఈనెల 5న జగిత్యాలలోని గాంధీనగర్‌లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా బాలికను గుర్తించి బాలికల సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి.. ఆ బాలికను చేరదీశారు. పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన బాలిక బంధువుతోపాటు, జగిత్యాలలోని వ్యభిచార గృహ నిర్వాహకురాలుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై..

మల్యాల(చొప్పదండి): సోషల్ మీడియాలో వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. మల్యాలకు చెందిన వివాహితను జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన టేకుమల్ల తిరుమల్ కొంతకాలంగా వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల్‌తోపాటు వాట్సాప్ గ్రూపు అడ్మిన్ దూడం శ్రీశైలంపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తిపై కేసు

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి గ్రామశివారులో ఓ రైతుకు చెందిన బోరుబావి మోటార్ పైపులు, విద్యుత్ వైర్లు ధ్వంసం చేసిన బర్ల రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామచంద్రం శనివారం తెలిపారు. గ్రామంలోని చిలివేరి గంగు అనే రైతుకు చెందిన బోరుబావి వద్దకు బర్ల రమేశ్ అక్రమంగా వెళ్లి మోటార్ పైపులు ధ్వంసం చేసి వైర్లను కోసి విద్యుత్ షాక్ తగిలేలా అమర్చినట్లు బాధిత రైతు ఫిర్యాదు చేశారన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి బర్ల రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామచంద్రం వివరించారు.

కాలువలో మహిళ మృతదేహం

సారంగాపూర్(జగిత్యాల): రేచపల్లి గ్రామ శివారుల్లోని డి–53 ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మనోహర్‌రావు శనివారం తెలిపారు. మృతురాలి వయస్సు 30–35ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. చేతిపై పచ్చబొట్టు ఉందని, కాలువలో జారిపడి చనిపోయిందా, లేక ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో విచారణ చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చామన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే 94407 95172 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

మృత శిశువు లభ్యం

మేడిపెల్లి(వేములవాడ): భీమారం మండలం పసునూరు గ్రామశివారులో మృతశిశువు లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. రాజలింగంపేట వెళ్లే రోడ్డు సమీపంలోని ముళ్లపొదల్లో శుక్రవారం రాత్రి శిశువు మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి సర్పంచ్‌కు సమాచారం అందించారు. ఆయన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు పసికందును అక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సర్పంచ్ లచ్చునాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా గోదారంగనాయకుల కల్యాణం


కిష్టంపేటలో కల్యాణ మహోత్సవం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, కిష్టంపేట గ్రామాల్లో గోదాదేవి రంగనాయకుల కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలుచేసి అనంతరం వేదమంత్రాల మధ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు కల్యాణం తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామం శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో భోగి పండగ సందర్భంగా శనివారం శ్రీరంనాథస్వామి, గోదాదేవిల కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మహిళలు కల్యాణం వీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, సర్పంచ్ జయ, ఉపసర్పంచ్ రాజేశం, నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు పసుల వెంకటి పేర్కొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా మంజూరలీ, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కార్యదర్శి అంజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కనుకయ్యగౌడ్‌ను ఎన్నికయ్యారు.